క్లుప్తంగా

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

రేపల్లె(చెరుకుపల్లి): బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా 15వ తేదీ సోమవారం నుంచి 19 వరకు రేపల్లె మండల స్థాయి బాల బాలికల అండర్–14 మరియు అండర్–17 ఆటల పోటీలు రేపల్లె మౌంట్ ఫోర్ట్ స్కూల్‌లో జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఆటలలో పాల్గొనే వారు అండర్–14 విభాగంలో 2012, జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలని, అండర్–17 విభాగానికి సంబంధించి 2019 జనవరి 1 తరువాత జన్మించి ఉండాలని తెలిపారు. 15వ తేదీ నుంచి ఖోఖో, కబడ్డీ, షటిల్, వాలీబాల్, యోగా, చెస్, మరియు అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఆటలలో పాల్గొనదలసిన వారు ఆయా పాఠశాలల నుంచి డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఎంట్రీ ఫామ్‌తో హాజరు కావాలని తెలిపారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులు తరువాత డివిజన్, జిల్లా స్థాయిల్లో పాల్గొనవల్సి ఉంటుందన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

తాడేపల్లిరూరల్: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేసి రూ. 26 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గుండిమెడ పారిశుద్ధ్య గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నూతక్కి మహేష్, కార్యదర్శిగా మెండ్రు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఉషారాణి, సహాయ కార్యదర్శిగా ఏబేద్, కోశాధికారిగా దావులూరి దినేష్‌ను కమిటీ ఎన్నుకుంది.

బాలికలకు నృత్య పోటీలు



తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్, శ్రీలక్ష్మీనారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బాలికలకు నృత్య పోటీలను నిర్వహించారు. కొత్తపేటలోని రాధాకృష్ణ కళ్యాణ మండపంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి జరిగిన ఈ పోటీల్లో పలువురు ఇంటర్ వరకు చదువుతున్న బాలికలు పాల్గొన్నారు. నృత్యం నేర్చుకుని ఉండాలనేది షరతు. శాస్త్రీయ విభాగంలో సోలో పోటీలు, పాశ్చాత్య నృత్యంలో సోలో, గ్రూప్ డ్యాన్స్, జానపద నృత్యాల కేటగిరీల్లో ఈ పోటీలను జరిపారు. పోటీల తదుపరి విజేతలకు ప్రథమ బహుమతిగా బంగారు నాణెం, ద్వితీయ బహుమతిగా వెండి నాణెం, తృతీయ బహుమతిగా నగదును అందజేశారు. పోటీల్లో పాల్గొన్న బాలికలు అందరికీ బహుమతులను అందజేశారు. రెయిన్‌బో ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ డి.జీవనలత ఆధ్వర్యంలో జరిగిన పోటీలను అలేఖ్య, వరలక్ష్మి, జ్యోతికాంత్, కోట భవాని, వసంత, భవ్య, అనూరాధ పాల్గొన్నారు.

జీవితంలో ఉన్నతంగా రాణించాలి



తెనాలిటౌన్: స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శనివారం తెనాలిలోని చైతన్య కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీచైతన్య ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్ చంద్రశేఖర్‌లు హాజరై వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను కాలేజీ యాజమాన్యం శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించింది. పలువురు విద్యార్థులు తమ కర్తవ్యాన్ని, భవిష్యత్ ప్రణాళికను సభాముఖంగా తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేటివ్ డీన్ కె.తిరుపతిరావు, రేపల్లె ప్రిన్సిపాల్ రజనిబాబు, తెనాలి కాలేజీ ప్రిన్సిపాల్స్ ఏడుకొండలు, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, ఏవోలు వెంకటరాయుడు, జనార్దన్ పర్యవేక్షించారు.

• డ్రగ్స్‌ను రూపుమాపుదాం



కూచినపూడి సచివాలయ ఆవరణంలో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషిచేయాలని నగరం ఎక్సైజ్ సీఐ మార్టూరి శ్రీరాంప్రసాద్ కోరారు. మండలంలోని కూచినపూడి సచివాలయ ఆవరణంలో శనివారం డ్రగ్స్, ఆల్కహాల్ నిరోధంపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగం వాటి వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను సీఐ వివరించారు. అదేవిధంగా డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, రవాణా గురించిన సమాచారం తెలిస్తే కంట్రోల్ రూమ్ నెం ః14405 కి కానీ, నగరం ఎక్సైజ్ కార్యాలయం 9490455599 నెంబరుకు గానీ తెలియ పరచాలని ఆయన కోరారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. – నిజాంపట్నం

• మనసు కవి ఆత్రేయ



ఆత్రేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సాహితీభారతి నాయకులు

మనిషి మనస్సును సున్నితంగా విశ్లేషించటంలో ఆచార్య ఆత్రేయ తనకు తానే సాటి అని సాహితీ భారతి సంస్థ అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ ప్రశంసించారు. బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో జరిగిన ఆత్రేయ వర్ధంతి సభకు రావూరి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఆత్రేయ దాదాపు 400 చిత్రాలకు 1400 పైచిలుకు పాటలు రచించి సాహితీ ప్రియులను అలరించారన్నారు. దగ్గుమల్లి శామ్యూల్ మాట్లాడుతూ ఆత్రేయ గేయ రచయితే కాకుండా గొప్ప నాటక రచయిత అని తెలిపారు. మాల్యాద్రి, ప్రముఖ హిందీ పండితులు అబ్దుల్ ఖాదర్ జిలానీ, ఆదం షఫీ, ఆత్రేయ శేష శైలావాస, ఎం.జాకబ్, షేక్ నిహాల్ అహ్మద్, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, కె.కాళిదాసు పాల్గొన్నారు. – బాపట్ల

సీతారాం ఏచూరికి ఘననివాళి



కొల్లూరు: సీపీఎం నాయకుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం కొల్లూరు ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ప్రజా సంఘాల నాయకులు బొనిగల సుబ్బారావు, పంతగాని నాగమల్లేశ్వరరావులు మాట్లాడుతూ, జాతీయస్థాయిలో మతోన్మాదాన్ని, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజా పోరాటాలను నడపడంలో ఏచూరి చిరస్మరణీయుడని కొనియాడారు. ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్, సురేష్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువులకు టీకాలు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో పశువులకు ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు టీకాలు వేయనున్నారు. వీటితో పాటు గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలను టీకాలు వేయనున్నారు.
ఫిరంగిపురం: నుదురుపాడు పశు వైద్యశాల పరిధిలోని పొనుగుపాడు, గుండాలపాడు, మునగపాడు, మేరికపూడి, వేమవరం, కండ్రిక లో ఈ నెల 15వ తేదీ నుంచి పశువులకు టీకాలు వేయనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్



మాట్లాడుతున్న మణిలాల్

రేపల్లె: రేపల్లె ఆర్టీసీ డిపో పరిధిలో పనిచేస్తున్న హైర్ బస్ (అద్దెబస్) డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. శనివారం రేపల్లె సీఐటీయూ కార్యాలయంతో జరిగిన యూనియన్ సమావేశంలో మణిలాల్ మాట్లాడుతూ రేపల్లె మదర్ థెరిస్సా హైర్ బస్ ప్రైవేట్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించటానికి రేపల్లె డిపో అధికారులు చొరవ చూపాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ప్రధానంగా హైర్ బస్ ప్రైవేట్ డ్రైవర్స్‌కు ప్రభుత్వ హామీల్లో భాగంగా ఆన్ కాల్ డ్రైవర్లుగా ఆర్టీసీ డిపో ప్రభుత్వ బస్ డ్యూటీలు ఇవ్వాలన్నారు. రేపల్లె డిపో పరిధిలో 35మంది హైర్ బస్ డ్రైవర్లు ఉంటే అధికారులు కొత్తగా సెలెక్ట్ చేసిన ఆన్ కాల్ డ్రైవర్లకు డ్యూటీలు కేటాయిస్తున్నారు కాని ఎక్కువ సంఖ్యలో ఉండి అనేక సంవత్సరాలుగా హై ర్‌బస్ డ్రైవర్లుగా రేపల్లె డిపో పరిధిలో ఉపాధి పొందుతున్న వారికి డ్యూటీలు కేటాయించక పోవటం వల్ల వారు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ప్రతి హైర్‌బస్ మీద ముగ్గురు డ్రైవర్లకు బస్ పాస్‌లు ఇవ్వవల్సి ఉన్నపటికీ అనేక ఆంక్షలు పెట్టి పాస్ లు ఇవ్వటం లేదని, ఇతర డిపోల్లో ఇస్తున్న విధంగానే బస్‌పాస్‌లు ఇవ్వాలని మణిలాల్ డిమాండు చేశారు. సీఐటీయూ బాపట్ల జిల్లా మహా సభల్లో భాగంగా ఈ నెల 27న రేపల్లె పట్టణంలో జరిగే కార్మిక ప్రదర్శన, కార్మిక సభలో హైర్ బస్ ప్రైవేట్ డ్రైవర్‌లు అందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మదర్ థెరిస్సా హైర్ బస్ ప్రైవేట్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, సభ్యులు భను, డి.శ్రీనివాసరావు, ఇతర డ్రైవర్లు పాల్గొన్నారు.

సుగాలి ప్రీతి తల్లిదండ్రులకు సీబీఐ న్యాయం చేయదు

- ఆడపిల్లల తల్లిదండ్రులు సీబీఐపై నమ్మం పెట్టుకోవద్దు
- ఆయేషా మీరా తల్లిదండ్రులు షంషద్ బేగం, ఇక్బాల్ బాషా



మాట్లాడుతున్న షంషద్‌బేగం, ఇక్బాల్ బాషా

తెనాలిరూరల్: సుగాలి ప్రీతి దల్లిదండ్రులకు సీబీఐ న్యాయం చేయదని, ఆడ పిల్లల తల్లిదండ్రులు సీబీఐపై నమ్మం పెట్టకోకూడదని ఆయేషా మీరా తల్లిదండ్రులు షంషద్ బేగం, ఇక్బాల్ బాషా అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 19న విజయవాడలోని సీబీఐ కోర్టులో విచారణకు రావాలని నోటీసులు రాగా వాటిని తిరస్కరించామని, 18 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నామని, ఇంకా విచారణ పేరిట తాత్సారం చేయడం బాధాకరమన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోతోందన్నారు. బాధితులమైన తాము ఎన్నిసార్లు కోర్టు చుట్టూ తిరగాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆయేషా మీరా కేసు విచారణ ముగిసిందంటూ జూన్‌లో సీబీఐ సీల్డ్ కవర్‌లో నివేదికను హైకోర్టుకు సమర్పించిందని, రిపోర్టు కాపీలు తమకు ఇవ్వకుండా కేసు గురించి తమ అభిప్రాయం ఎలా చెబుతామని ప్రశ్నించారు. మతసాంప్రదాయాలను పక్కన పెట్టి ఆయేషా మీరా భౌతిక కాయాన్ని వెలికి తీయించి రీ పోస్ట్‌మార్టంకు సహకరించామన్నారు. డబ్బు ఉన్న వాళ్లకే ధర్మం, నేరస్తులకే న్యాయం అన్న చందంగా కేసు విచారణ జరిగిందని ఆరోపించారు. ఆయేషా కేసు విషయంలో ప్రభుత్వానికి బాధ్యత ఉందని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి, డీజీపీ స్పందించి న్యాయం చేయాలని కోరారు.

కవిరాజా.. ఇదేమి దుస్థితయ్యా?!

- పార్కులో ప్రమాదభరితంగా ప్రహరీ
- పార్కు ఆవరణలో కనబడని స్వచ్ఛ పరిసరాలు
- శని, ఆదివారాలు సెలవులు కావడంతో పిల్లలతో రద్దీగా పార్కు



పార్కు దక్షిణ భాగాన భారీగా విరిగిపడిన ప్రహరీ



గేట్ వెంబడి పార్కు లోపల చెత్తాచెదారం

తెనాలిటౌన్: నిత్యం వాకర్స్, చిన్నారులు, మహిళలతో రద్దీగా ఉండే కవిరాజాపార్కు చెత్తచెదారంతో దర్శనమిస్తుంది. పార్కులోపల దక్షిణ భాగాన ప్రహరీ అధిక వర్షాలకు విరిగి నేలపై కూలేందుకు సిద్ధంగా ఉంది. స్థానిక నందులపేటలోని కవిరాజా పార్కులో ప్రమాదం పొంచి ఉంది. పార్కుకు దక్షిన భాగాన పెద్ద మొత్తంలో ప్రహరీ ముక్కలుగా విరగడంతో ఆ గోడ నేలపై కూలకుండా పార్కులోని చెట్లు కవచంలా నిలిచాయి. పార్కులో ఉదయం, సాయంత్రం మహిళలు, వృద్ధులు ప్రతిరోజు వాకింగ్ చేస్తుంటారు. చిన్నారులు సాయంత్రం సమయంలో ఆటపాటలతో గడుపుతుంటారు. వాకింగ్ ట్రాక్ దాటి పిల్లలు గోడ వైపునకు వెళితే జరగకూడని ప్రమాదం పొంచి ఉంది. అనేకమార్లు పార్కుకు వచ్చే వాకర్స్ ప్రహరీని పునఃనిర్మించాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కు లోపల గేటు వెంబడి చెత్తచెదారం దర్శనమిస్తుందని విమర్శిస్తున్నారు. కూలిన గోడను తొలగించిన దాని స్థానంలో కొత్త గోడను నిర్మించాలని, గేటు వెంబడి చెత్త చెదారం తొలగించి స్వచ్ఛ పరిసరాల పరిరక్షణకు కృషి చేయాలని పార్కుకు వచ్చే ప్రజానీకం కోరుతున్నారు. ముఖ్యంగా గోడ విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవాన్ని జయప్రదం చేయండి



తాడికొండ: విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవాన్ని జయప్రదం చేయాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ అన్నారు. శనివారం ఉద్దండరాయుని పాలెంలో మోదీ భూమి పూజ చేసిన ప్రాంతంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 17న బీజేపీ ఆధ్వర్యంలో సృష్టి పేరుతో విశ్వకర్మ యజ్ఞోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గుంటూరు జిల్లాలోని విశ్వబ్రాహ్మణ కులాలు, సంఘాల వారు, చేతి వృత్తుల వారు అమరావతి ప్రజలు రాజధానికి భూములు ఇచ్చిన ప్రజలు జయప్రదం చేయాల్సిందిగా రామకృష్ణ యాదవ్ పిలుపు నిచ్చారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురులో గల ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాసుస్వామి వారి పరంపర పీఠం 'దాసకుటి'లో 74వ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన షష్ఠమ పీఠాధిపతి శ్రీసీతారామదాసస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న సామూహిక కుంకుమార్చన కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. మోదమూడి, అంగలకుదురుకు చెందిన భక్తుల సహకారంతో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రమా సహిత శ్రీసత్యనారాయణస్వామి వ్రతం జరుగుతుందని శ్రీసీతారామదాస స్వామి తెలిపారు.

రేపటి పౌరులుగా ఎదగాలి

తాడికొండ: నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదగాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిస్టర్ విద్యా అన్నారు. గుడ్‌షెపర్డ్ ఆధ్వర్యాన తుళ్లూరు మండలం వడ్డమానులో ఆర్‌సీఎం చర్చి వద్ద శనివారం అంబేడ్కర్ బాలల పార్లమెంట్ బాధ్యతలు, విధుల ను తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ విద్య మాట్లాడుతూ చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

తెనాలి: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెనాలి మండల తహసీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఇప్పటికే తనిఖీలు చేస్తూ స్వాధీనం చేసుకుంటున్నట్టు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. తహసీల్దార్‌గా ప్రభుత్వ భూము ల పరిరక్షణ తమ బాధ్యతల్లో ఒకటిగా గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో భాగంగా నందివెలుగులో డొంక పోరంబోకు భూమి 1.73 ఎకరాలను గత 24 సంవ త్సరాలుగా ఒకే వ్యక్తి అనుభవంలో ఉందన్నా రు. తనిఖీల్లో ఈ విషయం తెలిసి, ఆ భూమిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పట్టణ పినపాడులో 2.93 ఎకరాల భూమి, తమ పూర్వీకులదంటూ కొందరు ఆక్రమించే పనిలో ఉన్నారని చెప్పారు. ఆ భూమినీ స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూముల జాబితా తెప్పించుకున్నామని, వాటిన్నింటినీ తనిఖీ చేస్తామని చెప్పారు.

రైతులందరికీ యూరియా అందజేస్తాం

మండల వ్యవసాయ అధికారి సీహెచ్ విజయరాజు



ముత్తుపల్లిలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ విజయరాజు

నిజాంపట్నం: రైతులందరికీ యూరియా అందించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ విజయరాజు తెలిపారు. మండలంలోని ముత్తుపల్లి గ్రామంలో రైతుసేవా కేంద్రందార్వా శనివారం రైతులకు యూరియ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాలతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులందరికీ యూరియా అందిస్తామన్నారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని ప్రతి రైతుకు యూరియా అందించేలా కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా అధికంగా యూరియా వాడకం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. అనంతరం ముత్తుపల్లి, పల్లపట్ల గ్రామాల్లో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి



వేదికపై మాట్లాడుతున్న డాక్టర్ జీవనలత

తెనాలిటౌన్: స్థానిక అయితానగర్‌లోని రక్షణ సైన్యం, తెనాలి మండలం సెంట్రల్ కోర్ ప్రార్థనా మందిరంలో శనివారం 14 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు యవ్వన స్త్రీలకు జూనియర్ హోంలీగ్ ర్యాలీని నిర్వహించారు. రాష్ట్రీయ ముఖ్యస్థానం అయిన చెన్నై నుండి టీఎస్‌డబ్ల్యుఎం లెఫ్టినెంట్ కర్నల్ రజియా గురునామ్ మసీ, మేజర్ మిక్కిలి సునీత కుమారి ముఖ్య అతిథులుగా హాజరై ఆత్మీయ సందేశాలతో ఆశీర్వదించారి. లెఫ్టినెంట్ కర్నల్ గేరా సీయోను కుమారి ఆధ్వర్యంలో జూనియర్ హోమ్ లీగ్ సెక్రటరీ కెప్టెన్ కెమరియమ్మ, మేజర్ బి.సుజాత, మేజర్ పి.హైమావతి, మేజర్ కారుమంచి సుజాత, సెంట్రల్ కోర్ మేజర్ రాజకుమారి, మరో 26 సంఘాల స్త్రీ, పురుష ఉద్యోగస్తుల సహకారంతో 350 మందితో జూనియర్ హోంలీగ్ ర్యాలీ ఘనంగా జరిగింది. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా డాక్టర్ జీవనలత, యవ్వన స్త్రీలకు పలు సూచనలను తెలియచేశారు. సెంట్రల్ కోర్ పెద్దలు మేజర్ క్రీస్తుదాస్, ట్రెజరర్ గాలి రవికుమార్, సెక్రటరీ పిల్లి కనకరత్నం, సంఘపెద్దలు అందరూ ప్రేమ విందులో పాల్గొన్నారు.

నృసింహుని ఆలయంలో భక్తజన సందడి



మంగళగిరిటౌన్: మంగళగిరిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దిగువ, ఎగువ సన్నిధుల్లో శనివారం భక్తులు పోటెత్తారు. రెండవ శనివారం సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి క్యూలో భక్తజనం వేచిఉన్నారు. దిగువ సన్నిధిలోని నరసింహస్వామిని, రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ఎగువ సన్నిధిలోని శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామిని భక్తితో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ 100 శాతం పూర్తవ్వాలి

కమిషనర్ అలీమ్ బాషా



అవగాహన కార్యక్రమంలో అధికారులు, రియల్టర్లు, బిల్డర్లు, స్థల యజమానులు

మంగళగిరిటౌన్: ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి తప్పిదాలకు తావు లేకుండా వంద శాతం పురోగతి సాధించాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని కాజా సచివాలయంలో శనివారం ఎల్‌ఆర్‌ఎస్‌పై రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, డెవలపర్లు, స్థల యజమానులకు అవగాహన కల్పించారు. కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ అక్టోబర్ 23లోపు రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్‌తో ఆ స్థలానికి న్యాయబద్ధమైన గుర్తింపు లభిస్తుందని, భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఆస్తి భద్రత కల్పించుకోవచ్చని సూచించారు. ఈ స్కీమ్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఓపెన్ స్పేస్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇచ్చామన్నారు. బిల్డింగ్ ప్లాన్ అనుమతి కావాలన్నా, లోన్, క్రయ విక్రయాలు జరపాలన్నా, ప్లాట్ రెగ్యులర్ చేయించుకుని ఉంటే మంచిదని వివరించారు.

అదుపు తప్పి మినీ లారీ బోల్తా

రోడ్డు విస్తరించాలంటున్న స్థానికులు



బోల్తాపడిన వాహనాన్ని పొక్లెయిన్‌తో తరలిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: మినీ లారీ అదుపుతప్పి బోల్తాపడిన ఘటన శనివారం తాడేపల్లిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఉండవల్లి సుందరయ్య చౌక్ నుంచి హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో యూరియా లోడ్‌తో వెళ్తున్న మినీ లారీ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి.. సైడ్ కాలులోకి దూసుకువెళ్లి బోల్తా పడటంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోల్తాపడిన వాహనాన్ని జేసీబీ సాయంతో తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డు వెడల్పు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లోక్ అదాలత్ లో 714 కేసులు పరిష్కారం



తెనాలి రూరల్: మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి కోర్టుల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. కేసుల పరిష్కరించడానికి నాలుగు బెంచ్‌లను ఏర్పాటు చేసి 714 కేసులు పరిష్కరించారు. వీటిలో 56 సివిల్ కేసులు, 656 క్రిమినల్ కేసులు, 2ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించారు. సుమారు రూ.5 కోట్ల 57 లక్షలు బాధితులకు ఇప్పించారు. 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్ పాల్గొన్నారు.